క్లుప్తంగా

25శాతంతో ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ

మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య



పరిగి: దరఖాస్తుదారులు మార్చి 31వరకు ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాలని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ లోపు ఎల్‌ఆర్‌ఎస్ చేసుకున్న వారికి ఫీజులో 25శాతం రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పరిగిలో ఇంకా ఎల్‌ఆర్‌ఎస్ ఇంటిమేషన్ కోసం 966 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

గ్రామాల వారీగా పహణీల స్కాన్

డిప్యూటీ తహసీల్దార్ మహేశ్



పహణీలను స్కాన్ చేస్తున్న డీటీ మహేశ్

బంట్వారం: గ్రామాల వారీగా పహణీల స్కాన్ ప్రక్రియను వేగవంతం చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ తెలిపారు. శుక్రవారం బంట్వారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన పహణీల స్కానింగ్‌ను పరిశీలించి మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 12 రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన స్కానింగ్ పనులు కొనసాగుతున్నాయన్నారు. 2000 -2015 సంవత్సరం మధ్య ఉన్న ప్రతీ పహణీని గ్రామాల వారీగా స్కాన్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ధరణి ఆపరేటర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, ఉపాధిపై ప్రణాళిక తప్పనిసరి

పంచాయతీ కార్యదర్శుల సమీక్షలో ఎంపీడీఓ వెంకన్న గౌడ్ సూచన



సమావేశంలో ఎంపీడీఓ వెంకన్నగౌడ్

బొంరాస్‌పేట: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, ఉపాధి కల్పనపై తక్షణ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీఓ వెంకన్న గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సముదాయపు హాల్లో శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న వేసవిలో గ్రామాల్లో, గిరిజన తండాల్లో మంచినీటి ఎద్దడి కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న కుటుంబానికి జాతీయ ఉపాధి హామీ పథకంలో పని కల్పించాలన్నారు. అందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటిపన్ను పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఏ స్‌ఏఈ రాఘవేందర్, ఏపీఓ ఇలియాస్, ఎంపీఓ రవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

బొంరాస్‌పేట: బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ సంఘాల నాయకులు పేర్కొన్నారు. అంబేడ్కర్ సంఘాల తాలూకా అధ్యక్షుడిగా ఎన్నికైన చెవిటి శ్రీనివాస్‌ను శుక్రవారం మండల కేంద్రంలో సన్మానించారు. అనంతరం కొడంగల్ పట్టణానికి చెందిన రమేష్‌బాబు మాట్లాడుతూ శ్రీనివాస్ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. అంబేడ్కర్ వాదాన్ని ప్రతీ మనిషికి వివరిస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌మాదిగ, మండల అ ధ్యక్షుడు విజయ్ కుమార్, మండల కోకన్వీనర్ గోవర్ధన్, శ్యామ్, వెంకటయ్య, రత్నం, పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కరీం

పరిగి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ కరీం పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంపై ఏజెన్సీలు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. మెను ప్రకారం భోజనం అందించాలని సూచించారు. తాజా కూరగాయలతో వంటలు చేయాలని సూచించారు.

కంపోస్టు షెడ్లు.. నిరుపయోగం!



గంగ్యాడలో అలంకారప్రాయంగా కంపోస్టుషెడ్డు



వృథాగా వానపాము, ఎరువుల తయారి షెడ్డు

- పంచాయతీల్లో సేంద్రియం కనుమరుగు
- చెత్తను ఒకే చోట చేర్చి నిప్పు
- సీసాలు, ప్లాస్టిక్ వస్తువులను వేరు చేయని సిబ్బంది
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

నవాబుపేట: గ్రామ పంచాయతీల్లో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రూ. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా తయారయ్యాయి. గత ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దనే ఉద్దేశంతో నవాబుపేట మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో పంచాయతీకి ఒకటి చొప్పున 32 నిర్మించారు. నిర్మించిన షెడ్లల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుల తయారు చేసుకోవాలని నిబంధన తీసుకొచ్చారు. దీంతో అక్కడ తయారు చేసే సేంద్రియ ఎరువును విక్రయించడం వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరుతాయని భావించింది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. ప్రారంభంలో అధికారులు హడావిడి చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఆవైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రభుత్వ ధనం వృథా..

పంచాయతీల్లో గత ప్రభుత్వం పల్లెప్రగతి ట్రాక్టర్లు కొనుగోలు చేసింది. తడి, పొడి చెత్త సేకరణకు ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ చేశారు. సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు కంపోస్టు షెడ్డుకు తరలించాలి. వాటిని పంచాయతీ సిబ్బంది ప్లాస్టిక్, గాజు, ఇనుము, రబ్బరు తదితర వస్తువలను వేరు చేసి ఆయా షెడ్లలోని అరల్లో నిల్వచేయాలి. ప్రస్తుతం అటువంటి పనులేవీ ఇక్కడ నిర్వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సేకరించిన చెత్తను ట్రాక్టర్లలో తరలించి ఒక చోట చేర్చి నిప్పు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పంచాయతీలకు ట్రాక్టర్ ఏర్పాటు చేయడం వల్ల ఎటువంటి ఉపయోగం జరగడం లేదని, ట్రాక్టర్ల ఏర్పాటుతో ప్రభుత్వ ధనం వృథా అవుతుందని స్థానికులు వాపోతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

తడి, పొడి చెత్తను వేరు చేసి షెడ్లలో వేస్తే ఎరువుగా మార్చడానికి ఎక్కువ సమయం పడుతుంది. వానపాములతో సేంద్రియ ఎరువును 40-60 రోజుల్లో తయారు చేయొచ్చు. ప్రస్తుతం తడి, పొడి చెత్తను వేరు చేయడం లేదు. వానపాములు లేవు, ఎరువుల తయారీ ఊసేలేదు. నిత్యం పంచాయతీ కార్మికులు చెత్తను ట్రాక్టర్‌లో తీసుకెళ్లి ఎక్కడో ఒక చోట పారబోసి తగులబెడుతున్నారు. దాంతో కంపోస్టుషెడ్ల ఉపయోగం తగ్గింది. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన కంపోస్టుషెడ్లు ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి. ఈ విషయంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఆవైపుగా కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> **పంచాయతీలకు నిధుల కొరత**
>
> 
>
> ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో పంచాయతీలకు మంజూరు కావాల్సిన గ్రాంట్లు రావడంలేదు. పంచాయతీల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. పంచాయతీ కార్మికులకు సైతం వేతనాలు ఇవ్వడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పంచాయతీలకు నిధులు మంజూరయ్యాక కంపోస్టు షెడ్లను ఉపయోగంలోకి తీసుకువస్తాం.
>
> – అనురాధ, ఎంపీడీఓ, నవాబుపేట

సోదరభావంతో మెలగాలి

తహసీల్దార్ తారాసింగ్

- ఎల్మకన్నెలో పౌరహక్కుల దినోత్సవం

తాండూరు రూరల్: గ్రామంలో ప్రతిఒక్కరూ సోదరభావంతో కలిసి ఉండాలని తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎల్మకన్నె గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామంలో కుల, మతాలకతీతంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఎవరినీ కూడా చిన్నచూపు చూడొద్దని సూచించారు. అనంతరం గ్రామస్తులతో అందరూ సమానమేనని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల మండల అధికారి గోవింద్, పంచాయతీ కార్యదర్శి సరిత, జూనియర్ అసిస్టెంట్ బాలు పాల్గొన్నారు.



ఎల్మకన్నెలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

మధ్యాహ్న భోజనం తనిఖీ

పౌరహక్కుల దినోత్సవ అనంతరం తహసీల్దార్ తారాసింగ్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం వడ్డించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



కుల్కచర్ల: అవగాహన కల్పిస్తున్న షీటీం ఇంచార్జి మనీషా

కుల్కచర్ల: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరమని షీటీం కానిస్టేబుల్ మనీషా పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో షీటీం ఆధ్వర్యంలో పోలీస్, చట్టాలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మనిషా మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థిని సమాజంలో జరుగుతున్న మంచి, చెడులతో పాటు సామాజికపరమైన అంశాలను తెలుసుకోవాలన్నారు. బాల్యవివాహాలను నిషేధించాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతుందని తెలిస్తే ఉపాధ్యాయులకు, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. షీటీం అధికారులు శోభారాణి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిహెప్సిబా, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మర్పల్లి తహసీల్దార్ మునీరొద్దీన్ అన్నారు. కోట్‌మర్పల్లి గ్రామంలో ఎస్సీ బాలికల వసతి గృహంలో వార్డేన్ తుల్జారాంగౌడ్, మర్పల్లి ఎస్‌ఐ సురేశ్‌తో కలిసి పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సమాజంలో అంటరాని తనాన్ని రూపుమాపలని, దీనికోసం ప్రతీ పౌరుడు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా ఆడపిల్లలకు వివాహం చేస్తే చట్ట రీత్య నేరమన్నారు. కాంగ్రెస్ బ్లాక్-2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి, ఆర్‌ఐ మాధవరెడ్డి, మర్పల్లి మార్కెట్ డైరెక్టర్ డీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మర్పల్లి: కోట్‌మర్పల్లిలో పౌరహక్కులపై మాట్లాడుతున్న తహసీల్దార్ మునీరొద్దీన్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



కుల్కచర్ల: వీరాపూర్‌లో సీసీరోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సోమలింగం

కుల్కచర్ల: అభివృద్ధిపనుల నిర్వహణలో నాణ్యత పాటించాలని చౌడాపూర్ ఎంపీడీఓ సోమలింగం పేర్కొన్నారు. శుక్రవారం వీరాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధి హామీ నిధులతో వేస్తున్న రహదారులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా తయారు చేయాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. అనంతరం చౌడాపూర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో త్రాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డీసీసీ కార్యదర్శి షకీల్ పేర్కొన్నారు. శుక్రవారం అంగడిచిట్టంపల్లి గ్రామంలో రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేశ్‌కుమార్, రవి, అమర్‌నాథ్, గోపాల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

అనంతగిరి: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ శరత్ చంద్ర పేర్కొన్నారు. వికారాబాద్ పట్టణంలోని సెయింట్ జూడ్స్ ప్రైమరీ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతోపాటు సమాజంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత తరుణంలో పిల్లలకు ప్రతీ విషయం టీవీ, ఫోన్లు, ఐపాడ్లు ఇవ్వడంతో పిల్లల ఏకాగ్రత లోపిస్తుందన్నారు. ప్రతి విషయము తెలుసుకోవాలన్న ఆలోచనతో సాంఘిక మాధ్యమాలపై ఆధారపడవలసి వస్తుందని గుర్తుంచుకునే జ్ఞానం తగ్గుతుందన్నారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే లక్ష్యం

కుల్కచర్ల: రైతాంగ అభ్యున్నతే లక్ష్యమని కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. శుక్రవారం కులకచర్ల మండల కేంద్రంలో మండల పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయన్నారు. రైతాంగ అవసరాల నిమిత్తం స్వల్పకాలిక, ధీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నాయని తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆంజనేయులు ముదిరాజ్, పాంబండ ఆలయ చైర్మెన్ కోట్ల మైపాల్ రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, వైస్ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిద్దాం



ముజాహిద్‌పూర్‌లో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కుల్కచర్ల: యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిద్దామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలో యూపీఎస్ విధానాన్ని నిరసిస్తూ మార్చి 2వ తేదీన నిర్వహించనున్న యుద్ధభేరి సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇటీవల కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానానికి ఆమోదం తెలిపిందని, అన్ని రాష్ట్రాలు దీన్ని ఆమోదం తెలిపితే ఇబ్బందులు తప్పవన్నారు. దీంతో సుమారు 70వేల మందికి అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగులందరూ మార్చి2వ తేదీన భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటయ్య, ఎల్లయ్య, యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, చక్రపాణి, భాస్కర్, పాండు, శేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

పూడూరు: మండలంలోని కంకల్ వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవం కనుల పండువగా సాగింది. రాకంచర్ల పీఠాధిపతులు వెంకటదాసుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం హరికథ కార్యక్రమం నిర్వహించారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

• కాంస్య విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

అనంతగిరి: వికారాబాద్‌లోని ఎన్నెపల్లి చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 12 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కోఆర్డినేటర్ వడ్లనందు, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సంతోష, విగ్రహ ఆవిష్కరణ కమిటీ ప్రతినిధులు రాజలింగం, ఆనంద్, జగదీష్, రాంచందర్, పవన్, పాల్గొన్నారు.

• భక్తులతో కిటకిటలాడిన దేవాలయం

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన పోలేపల్లి ఎలమ్మ దేవాలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ నెల 21న అమ్మవారి సిడే నిర్వహించారు. బ్రహ్మోత్సవాల తర్వాత కూడా ఎల్లమ దేవాలమం భక్తులతో కిటకిటలాడుతుంది. దాదాపుగా 5వేల మంది భక్తులు దేవాలయాన్ని దర్శించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక బోనం, కోడిపుంజులు, మేకపోతులను భక్తులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

• నేడు మార్కండేయ ఆలయ వార్షికోత్సవం

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవం శనివారం నుంచి ప్రారంభమౌతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఆలయ వార్షికోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భూకైలాస్‌లో ముగిసిన బ్రహ్మోత్సవాలు

తాండూరు రూరల్: భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. నాలుగు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో మహారాష్ట్రకు చెందిన నేల,నీటి సంరక్షణ శాఖ మంత్రి సంజయ్ రాథోడ్ ప్రత్యేక హెలిక్యాప్టర్ ద్వారా చేరుకొని పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శుక్రవారం భవానీ మాత పూజ అనంతరం బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు వాసుపవార్ నాయక్ పేర్కొన్నారు.

• బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా



కుల్కచర్ల: కుల్కచర్ల: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం కామునిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాలయ్య అనారోగ్యంతో ఇబ్బందులకు గురౌతున్నారనే విషయం తెలుసుకుని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇబ్బందికర సమయంలో ధైర్యంగా ఉండాలని, కొన్ని సందర్భాలలో అనారోగ్య పరిస్థితులు మానసికంగా కృంగదీస్తాయన్నారు. ఐనప్పటికీ మానసిక ఒత్తిడిని జయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తబలిజ రాజు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించేదే సైన్స్

జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ శాస్త్రవేత్త 'రామన్ ఎఫెక్ట్ ఆవిష్కర్త' సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించేది సైన్స్ అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. వాటిని సందర్శించిన పలువురు నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారిని అభినందించారు.



దుద్యాల్: నమూనా వివరాలు తెలుసుకుంటున్న ఎంఈవో విజయరామారావు



తాండూరు టౌన్: టీజీ గురుకులలో విద్యార్థులు తయారు చేసిన రాకెట్



దోమ: దొంగఎన్కేపల్లి పాఠశాలలో ..



కుల్కచర్ల: క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్లో విద్యార్థినితో మాట్లాడుతున్న ఎంఈఓ అబీబ్ అహ్మద్



యాలాల: కేజీబీవీలో సైన్స్ దినోత్సవంలో సిబ్బంది



బొంరాస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో..



నేతాజీ స్కూల్లో విద్యార్థులు తయారు చేసిన ఏటీఎం